నేడు యథావిధిగా పిజిఆర్ఎస్
కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక కలెక్టరేట్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. డివిజన్, మండలస్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయా పరిధుల్లోని అధికారులు అందరూ విధిగా హాజరుకావాలని తెలిపారు. సమస్యల పరిష్కారానికి అర్జీల రూపంలో అధికారులకు అందించాలని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

విద్యుత్ బిల్లు తీయండి.. మహాప్రభో..!

- 3న తీయాల్సిన బిల్లులు నేటికీ తీయని దుస్థితి
- యూనిట్ శ్లాబులు పెరిగి బిల్లుల బాదుడుపై జనం బెంబేలు
- తమకేమీ సంబంధం లేదంటున్న విద్యుత్ శాఖాధికారులు
- ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీల పేరుతో బాదుడు
- ఆలస్యంగా తీయడంతో షాక్ కొట్టనున్న బిల్లులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యంతో జనాలకు విద్యుత్ బిల్లులు పెనుభారంగా మారుతున్నాయి. విద్యుత్ వాడకం నిర్ధారించే బిల్లులు సమయానికి తీయడంలో విద్యుత్ శాఖ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో యూనిట్ శ్లాబులు పెరిగిపోయి విద్యుత్ బిల్లులు భారంగా మారే పరిస్థితి ఏర్పడింది. దీంతో విద్యుత్ బిల్లులు తీయండి.. మహాప్రభో అంటూ జనం ఆందోళన చెందుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 12 లక్షల వరకూ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతులు గృహ వినియోగదారులు ఉన్నారు. ప్రతినెలా మూడో తేదీన ప్రారంభించి ఒక్కో ప్రాంతానికి ఒక్కో తేదీన విద్యుత్ బిల్లులను జనరేట్ చేస్తారు. ఏమాత్రం ఆలస్యమైనా యూనిట్ శ్లాబులు మారిపోతాయి. విద్యుత్ బిల్లులో ఒకటి నుంచి 50 యూనిట్ల వరకూ ఒక ధర, 50 నుంచి వంద యూనిట్ల వరకు ఇంకో ధర ఇలా అంచెలంచెలుగా యూనిట్ ధరలు ఉంటాయి. ప్రతినెలా 50 యూనిట్లలోపు ఖర్చు చేసే వినియోగదారుడికి నాలుగైదు రోజులు ఆలస్యమైతే విద్యుత్ యూనిట్లు పెరిగి బిల్లు మోత మోగనుంది. విద్యుత్ బిల్లులు సకాలంలో తీసేలా ప్రభుత్వం ప్రయివేటు వారికి అప్పగించింది. ఏలూరులోని పవర్‌పేటలో ఏప్రిల్‌లో కరెంటు బిల్లులు మూడో తేదీన తీయాల్సి ఉంది. ఆరో తేదీ వచ్చినా ఇప్పటికీ కరెంటు బిల్లులు తీయలేదు. ఇప్పటికే మూడు రోజులు అదనంగా గడిచిపోయింది. ఇంకా ఎన్ని రోజులకు తీస్తారో కూడా తెలియని పరిస్థితి ఉంది. పవర్‌పేటలోనే కాదు, జిల్లా కేంద్రం ఏలూరులోని పలు ప్రాంతాలతోపాటు, గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. విద్యుత్ బిల్లుల రూపంలో పెద్దఎత్తున ఆదాయం దండుకుంటున్న విద్యుత్‌శాఖ ప్రజలకు విద్యుత్ బిల్లులు సకాలంలో అందించడంలో మాత్రం విఫలమవుతోంది. కరెంటు బిల్లులు సకాలంలో తీయకపోవడంతో జనం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఇప్పటికే అదనపు ఛార్జీల బాదుడుతో గగ్గోలు

గత వైసిపి ప్రభుత్వంతోపాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వం సైతం అదనపు ఛార్జీల బాదుడుతో వినియోగదారులను పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఎనర్జీ, ఫిక్స్‌డ్, ట్రూఅప్, ఇడి ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ 1, 2, 3 ఛార్జీల రూపంలో వీర బాదుడు బాదుతోంది. నెలకు రూ.600 కరెంటు బిల్లు వస్తే అందులో రూ.300 అదనపు ఛార్జీలే ఉంటున్నాయి. ఇప్పుడు విద్యుత్ బిల్లు తీయడం ఆలస్యం చేయడంతో శ్లాబులు మారిపోయి బిల్లులు మరింత మోతమోగిపోయే పరిస్థితి ఏర్పడింది. కరెంటు బిల్లులు సైతం సకాలంలో అందించకపోవడంపై కూటమి ప్రభుత్వంపై జనాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ బిల్లుల ఆలస్యంపై ఆ శాఖ అధికారులను అడిగినా సరైన సమాధానం లేకుండాపోయింది. పవర్‌పేటలో విద్యుత్ బిల్లుల ఆలస్యంపై ఆ శాఖ పరిధిలోని అధికారితో మాట్లాడగా ప్రయివేటుకు ఇచ్చారని, తామేమీ చేయలేమని చేతులెత్తేసిన పరిస్థితి ఉంది. బిల్లు కావాలంటే వాట్సాప్‌కు సర్వీస్ నెంబర్ పంపితే వచ్చి బిల్లు తీస్తారంటూ విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. విద్యుత్ బిల్లులు సకాలంలో తీయకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సంబంధిత కాంట్రాక్టర్‌ను నిలదీయాల్సిన అధికారులు తప్పించుకునే ధోరణిలో మాట్లాడటం విడ్డూరంగా ఉంది. విద్యుత్ బిల్లుల ఆలస్యంపై ఏలూరులోని విద్యుత్‌శాఖ ఎస్ఇని వివరణ కోరేందుకు ఫోన్లో ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. వెంటనే విద్యుత్ బిల్లులు తీసేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను జనం కోరుతున్నారు.

సిపిఎం అఖిల భారత మహాసభ ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి తమిళనాడులోని మధురైలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న పశ్చిమగోదావరి జిల్లా నేతలు

40 లక్షల పని దినాలు కల్పిస్తాం

- గతేడాది లక్ష కుటుంబాలకుపైబడి పని కల్పించి 96.69 శాతం లక్ష్యం సాధించాం
- 4,239 కుటుంబాలకు వంద రోజులు పని కల్పించాం
- మూగ జీవాలకు రూ.50 లక్షలతో 140 నీటి తొట్టెల ఏర్పాటుకు ప్రణాళిక
- ప్రభుత్వం నిర్దేశించిన రూ.307 వేతనం అందించేందుకు చర్యలు
- 'ప్రజాశక్తి'తో డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు

ప్రజాశక్తి - భీమవరం

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద ఈ ఏడాది 40 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా తీసుకున్నామని డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు తెలిపారు. గతేడాది 96.69 శాతం లక్ష్యం సాధించామని, ఈ ఏడాది నూటికి నూరు శాతం లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. వేసవి నేపథ్యంలో మూగజీవాలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా రూ.50 లక్షలతో జిల్లాలో 140 నీటితొట్టెలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది నుంచి రోజుకి రూ.307 వేతనం అందించాలనే ముఖ్యోద్దేశంతో ఉందని, ఆ దిశగా దీన్ని సాధించేందుకు చర్యలు ముమ్మరం చేస్తామని అన్నారు. జిల్లాలో ఎన్ఆర్ఇజిఎస్‌లో జరిగే పనులకు సంబంధించి ఈ ఏడాది తీసుకున్న లక్ష్యాలు, గతేడాది సాధించిన ఫలితాలు, జిల్లా సమగ్రాభివృద్ధికి ఉపాధి హామీ ద్వారా తీసుకున్న చర్యలపై డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో వెల్లడించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి. ఎంతమంది కూలీలు ఉన్నారు?

పీడీ: జిల్లావ్యాప్తంగా లక్షా 82 వేలు జాబ్‌కార్డులు ఉన్నాయి. దీనిలో సుమారు రెండు లక్షల 94 వేల మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. రోజుకు సరాసరి లక్షా 30 వేల మందికి పనులు కల్పిస్తున్నాం.

ప్రశ్న: గతేడాది ఎన్ని పని దినాలు కల్పించారు?

పీడీ: 39 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా తీసుకోగా 37.71 లక్షల పని దినాలు కల్పించాం. 96.69 శాతానికిపైగా లక్ష్యం సాధించాం. 1,02,792 కుటుంబాలకు పని కల్పించాం. ఎస్‌సిలకు 28.66 శాతం, ఎస్‌టిలకు 0.87 శాతం, మహిళలకు 55.45 శాతం పని దినాలను కల్పించాం. 2,611 మంది విభిన్న ప్రతిభావంతులకు జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరిలో 1,344 మందికి పనులు కల్పించాం.

ప్రశ్న: ఎన్ని కుటుంబాలకు వంద రోజులు పని కల్పించారు. ఒక కుటుంబానికి సగటున ఎన్ని రోజులు ఉపాధి చూపించారు?

పీడీ: జిల్లాలో 4,239 కుటుంబాలకు వంద రోజులు పని కల్పించాం. ఒక కుటుంబానికి సగటున 36.68 రోజులు ఉపాధి చూపించాం.

ప్రశ్న: మెటీరియల్ కాంపొండ్, వేతనాల రూపంలో ఎంత చెల్లించారు?

పీడీ: సగటు వేతనం రూ.255.55 ఉండగా, జిల్లాలో రూ.268.46 చొప్పున అందించాం. గత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.101.23 కోట్లు వేతన రూపంలో చెల్లించాం. మెటీరియల్ వ్యయం రూ.44.82 కోట్లు, జీతభత్యాల నిర్వహణ వ్యయంతో కలుపుకుని మొత్తం రూ.152.68 కోట్లు వెచ్చించాం.

ప్రశ్న: ఎన్ని పనులు చేపట్టారు. ఎన్ని పూర్తి చేశారు. ఏఏ పనులు చేశారు?

పీడీ: జిల్లావ్యాప్తంగా 33 వేల పనులు చేపట్టాం. దీనిలో 25 వేల పనులు పూర్తి చేశాం. ఫీల్డ్ ఛానల్స్, ఫీడర్ ఛానల్స్, మేజర్, మైనర్, డిస్ట్రిబ్యూటరీ ఛానల్స్‌లో సుమారు 20 వేల కిలోమీటర్ల మేర పూడికతీత పనులు చేశాం. పండ్ల తోటల భూముల్లో రింగ్ ట్రెంచ్ తవ్వకం, తాగునీటి, సాగునీటి చెరువులు, పశువుల చెరువుల పునరుద్ధరణ పనులు చేశాం. పండ్ల తోటల పెంపకం ప్రాజెక్టు కింద 162 ఎకరాల్లో కొబ్బరి, మామిడి, జామ పంటలకు ప్రోత్సాహం అందించి ఎస్‌సి, ఎస్‌టి, సన్న, చిన్నకారు రైతులకు చేయూతనిచ్చాం. బ్లాక్ ప్లాంటేషన్ కింద 58.3 ఎకరాల్లో కొబ్బరి మొక్కల పెంపకం విస్తృతంగా చేపట్టి చెరువు గట్లను బలోపేతం చేశాం.

ప్రశ్న: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఎంత నిధులు వెచ్చించి ఎన్ని పనులు పూర్తి చేశారు?

పీడీ: జిల్లాలో 53.66 కిలోమీటర్ల పొడవునా సీసీ రోడ్లు, 1.36 కిలోమీటర్లు మేర విఐపిఎం రోడ్లు, 2.80 కిలోమీటర్లు మేర బిటి రోడ్లు నిర్మించాం. 348 పనులు పూర్తి చేసి సుమారు రూ.29.68 కోట్లు చెల్లించాం.

ప్రశ్న: మినీ గోకులాల నిర్మాణాలు ఏవిధంగా సాగుతున్నాయి?

పీడీ: 772 మినీ గోకులాలు నిర్మించాలని లక్ష్యంగా తీసుకోగా 498 గోకులాల నిర్మాణాలు పూర్తి చేశాం. రూ.4,29,32,050 ఖర్చు చేశాం. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

ప్రశ్న: 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎన్ని పని దినాలు కల్పించాలని లక్ష్యంగా తీసుకున్నారు. మిగిలిన పనులకు ప్రణాళిక రూపొందించారా?

పీడీ: జిల్లాలో 40 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా తీసుకున్నాం. గతేడాది సాధించిన ప్రగతికి మించి ఫలితాలు సాధించాలని ప్రణాళిక రూపొందించాం. రూ.50 లక్షలతో మూగ జీవాలకు 140 నీటి తొట్టెలు నిర్మించేందుకు అంచనాలు తయారు చేశాం. ఏప్రిల్ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేస్తాం. 20 వేల కిలోమీటర్ల మేర పూడికతీత పనులు, 200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం, పశుగ్రాస పెంపకం, తాగు, సాగునీటి చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టనున్నాం. అలాగే గతేడాది ఇచ్చిన వేతనం కాకుండా ప్రభుత్వం గుర్తించిన వేతనం రూ.307 అందించే విధంగా చర్యలు చేపట్టాం.

ప్రశ్న: ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ఎంతమంది పని చేస్తున్నారు?

పీడీ: గతంలో 20 మంది కూలీలకు ఒక మేట్ ఉండేవారు. ప్రస్తుతం ప్రతి 50 మందికీ ఒకరు మాత్రమే ఉన్నారు. జిల్లాలో 2076 మంది మేట్లు పని చేస్తున్నారు. 408 గ్రామ పంచాయతీలు ఉండగా మొదటి కేటగిరీలో 275 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, రెండో కేటగిరీలో 87, మూడో కేటగిరీలో 362 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు.

ప్రశ్న: వేసవి నేపథ్యంలో పని ప్రదేశాల్లో ఏమైనా కూలీలకు ఉపశమనం కలిగించే సౌకర్యాలు కల్పించారా?

పీడీ: పని ప్రదేశాల్లో వేసవి నుంచి ఉపశమనానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులూ మంజూరు కాలేదు. ఆయా మండలాల్లో ఎంపిడిఒలకు పని ప్రదేశాల్లో మౌలిక వసతుల కల్పనకు ఆదేశాలు జారీ చేశాం. తాటాకు పందిళ్లతోపాటు బ్లూ టెంట్లు, తాగునీరు అందించాలని నిర్దిష్టంగా ఆదేశాలు జారీ చేశాం.

సమస్యల నిలయం.. కాళ్లలంక కాలనీ

వీధిదీపాలు వెలగక విషసర్పాలతో బెంబేలు - అరకొర తాగునీటితో దాహార్తితో విలవిల

కాళ్ల లంక ప్రభుత్వ కాలనీ

ప్రజాశక్తి - కాళ్ల

పాలకులు మారినా ప్రభుత్వ కాలనీల్లో పేదల సమస్యలు పరిష్కారం కావడం లేదు. గత వైసిపి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా కాలనీలు కాదు.. ఊర్లు నిర్మిస్తున్నామంటూ గొప్పలు చెప్పి జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. అయితే ఆ కాలనీల్లో పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో నివాసముంటున్న లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రమైన కాళ్లలోని ప్రభుత్వ కాలనీ ప్రజలు తీవ్ర అసౌకర్యాలతో అల్లాడుతున్నారు. తమ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని నివాసితులు వాపోతున్నారు. రోడ్లు, తాగునీరు, వీధిదీపాలు లేక నానావస్థలు పడుతున్నామని చెబుతున్నారు.

సిపిఎం ఇటీవల నిర్వహించిన ప్రజాచైతన్య సైకిల్ యాత్రలో భాగంగా నేతలు ఆ కాలనీని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకుంది. ఈ కాలనీలో 122 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. సుమారు 30 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నాయి. మరో 60 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ కాలనీలో ఇళ్ల నిర్మాణానికి స్థలాలైతే ఇచ్చారుగాని, దీని అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఈ కాలనీ గ్రామానికి సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ కాలనీకి వెళ్లాలంటే పంట కాలువ దాటాలి. తాత్కాలికంగా వేసిన తూరలపై నుంచి వేసిన మార్గం గుండా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన నిర్మాణానికి గతంలో మండల పరిషత్ రూ.నాలుగు లక్షలు కేటాయించింది. ఇటీవల కాంట్రాక్టర్ పెద్ద పెద్ద తూరలతోపాటు నిర్మాణ సామగ్రి తెచ్చినా పనులు ప్రారంభించలేదు. మరోపక్క ఈ కాలనీకి వెళ్లే మార్గంలో వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి వేళ విషసర్పాల బెడద తప్పడం లేదని నివాసితులు వాపోతున్నారు. దీనికితోడు ఈ కాలనీలో రెండు రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. దీంతో జనం తాగునీటి కోసం పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. దీనికితోడు దోమల బెడద వెంటాడుతోంది. కాలనీలో ప్రధాన రహదారితోపాటు అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. వర్షాకాలంలో వీటి పరిస్థితి మరీ దారుణం.

వంతెన నిర్మించేందుకు సిద్ధంగా ఉన్న తూరలు

ఆక్వా చెరువులతో అవస్థలు

అత్యంత ప్రధానమైన సమస్య మరొకటి ఇక్కడి ప్రజలను వేధిస్తోంది. ఈ కాలనీకి చేర్చి తూర్పున పంట కాలువ, దక్షిణంలో పెద్ద చేపల చెరువు, ఉత్తరంలో అనుమతులు లేకుండా తవ్విన రెండు రొయ్యల చెరువులు ఉన్నాయి. వీటితోనే పలు ఇబ్బందులు పడుతున్న తమకు ఇటీవల పడమర దిక్కులో ఉన్న భూములను ఆక్వా చెరువులుగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. దీనిపై కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. చుట్టూ చెరువులు తవ్వేస్తే తాము కాలనీ విడిచి వెళ్లక తప్పదని, ఇక్కడ నివాసం ఉండటం అసాధ్యమని అక్కడి ప్రజలు లబోదిబోమంటున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

గొర్ల రామకృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి, కాళ్ల

జగనన్న కాలనీల్లో తాగునీటి సమస్య విపరీతంగా ఉంది. అధికారులు తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో దాహార్తిని తీర్చుకునేందుకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొనుగోలు చేయలేనివారు కలుషిత నీటినే తాగడం లేక సుదూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవడం ద్వారా దాహార్తి తీర్చుకుంటున్నారు. దీంతోపాటు అధికారులు కాలనీలో రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలి.

వీధిదీపాలు ఏర్పాటు చేయాలి

బి.నర్సవేణి, కాళ్లలంక కాలనీవాసి

కాలనీలో వీధి దీపాలు లేక రాత్రి పూట అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేసి మా ఇబ్బందులు పరిష్కరించాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాళ్లలంక జగనన్న కాలనీలో సమస్యలను పరిష్కరించాలి.

'వక్ఫ్' సవరణకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - పాలకోడేరు

కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పెన్నాడ అగ్రహారంలో ముస్లిం బిస్మిల్లా మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఈ నిరసనకు సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య సంఘీభావం తెలిపి మాట్లాడారు. వక్ఫ్ చట్ట సవరణ ద్వారా ముస్లిం ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టనున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో లౌకికవాద పార్టీలుగా చెప్పుకుంటున్న టిడిపి, జనసేన పార్లమెంట్‌లో ఈ బిల్లుకు మద్దతు పలకడం దారుణమని, లౌకికతత్వానికి విఘాతమని అన్నారు. కార్యక్రమంలో షేక్ నాగూర్‌సాహెబ్, ఉమర్ ఆలీషా, నబీ సాహెబ్, మిలా సాహెబ్, సులేమాన్, ముసాలా సాహెబ్, హస్సేన్ సాహెబ్, మీరవల్లి సాహెబ్, అమీర్ సాహెబ్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ముస్లిములు

రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాష్ట్రంలో రైతుల శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. శివదేవుని చిక్కాలలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రైతులు పండించిన ధాన్యాన్ని స్వేచ్ఛగా అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. మిల్లుల వద్ద వారం రోజులు రాత్రింబవళ్లు పడిగాపులు పడాల్సి వచ్చేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదని, రైతులు నచ్చిన మిల్లుకు స్వేచ్ఛగా ధాన్యం అమ్ముకోవచ్చని చెప్పారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాలో సొమ్ము జమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, డిప్యూటీ తహశీల్దార్ నరేష్ కుమార్, సివిల్ సప్లయీస్ డిఎం శివరామ్ ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వర్లు, డిసిఒ ఎం.నాగరాజు, సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఎస్.శ్రీనివాస్, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, ఇఒపిఆర్‌డి మూర్తిబాబు, సివిల్ సప్లయీస్ అధికారి ఎన్.సరోజ, ఎడిఎ పార్వతి, సర్పంచి దిడ్లమణి వజ్రం, ఎంపిటిసి మేడిది స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

శివదేవునిచిక్కాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి రామానాయుడు

గోతులు పూడ్చి తాగునీటిని అందించాలి

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం

ప్రకాష్ నగర్ ఎస్‌టి కాలనీలో తాగునీటి పైపులైను ఏర్పాటుకు గోతులు తీసి వదిలేశారని, తక్షణం వాటిని పూడ్చి పైప్‌లైన్ ద్వారా తాగునీటిని అందించాలని సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం ఆందోళన చేపట్టారు. స్థానిక 29వ వార్డులోని ఎస్‌టి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఈ ఆందోళనలో సిపిఎం నేత ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ ప్రకాష్‌నగర్ ఎస్‌టి కాలనీలో తాగునీటి పైపులైను ఏర్పాటు చేసేందుకు గోతులు తవ్వి రెండు నెలలు కావొస్తున్నా అవి పూడ్చకపోవడం దారుణమన్నారు. అనేకసార్లు కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఈ గోతులు పూడ్చకపోవడం వల్ల వాటిలోకి మురుగునీరు చేరి ఇళ్లలోకి రావడంతో దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే పైప్‌లైన్ కోసం తవ్విన గోతులను పూడ్చి పైపులైన్ ద్వారా తాగునీరు అందించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గారావు, సంజీవరావు, మరియమ్మ, అక్కులయ్య, ఏసు పాల్గొన్నారు.

గోతులు తవ్వి పూడ్చకుండా వదిలేసిన ప్రాంతాన్ని చూపిస్తున్న స్థానికులు

రొయ్య రైతులను ఆదుకోవాలని ధర్నా

గణపవరం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల మోత వల్ల ఆక్వా పరిశ్రమ దివాళా తీసే ప్రమాదంలో ఉందని, తమను ఆదుకోవాలంటూ రొయ్య రైతులు ఆదివారం స్థానిక పోలీస్ ఐల్యాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు ఆక్వా రైతు కాకర్ల వినాయక అధ్యక్షత వహించారు. ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర నాయకులు రుద్రరాజు యువరాజు, స్థానిక నేత అడబాల రంగా మాట్లాడుతూ ఆక్వా రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. రొయ్యకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి కూనసాని నాగేశ్వరరావు, గుల్లిపల్లి మాధవ, రమేష్‌బాబు, భూపతిరాజు సతీష్, విష్ణు, ప్రియమధు నాయకత్వం వహించారు.

ధర్నా చేస్తున్న ఆక్వారైతులు



చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ తానేటి శ్రీనివాసరావు చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా వేసవి కాలంలో పవన్ మెస్ సెంటర్లో చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, మూడు నెలలకుపైగా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చలివేంద్రంతో పాటు ఉచిత వైద్య సేవలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ వ్యవస్థాపకులు కోమటి సోమేశ్వరరావును ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమళ్ల సూరిబాబు అభినందించారు. ప్లాస్టిక్‌పై ప్రజలు యుద్ధం చేయాలని, ప్లాస్టిక్ రహిత తాడేపల్లిగూడెం నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌ను సత్కరించారు.

తణుకు : మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో అభిమానులు చేపట్టిన సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకొని తణుకు జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల సమీపంలో తణుకు టౌన్, తాలుకా వైడ్ మెగాస్టార్ చిరంజీవి, పవన్‌కల్యాణ్, రామ్‌చరణ్, మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. మండు వేసవిలో సామాన్యుల దాహార్తిని తీర్చే విధంగా చలివేంద్రాన్ని అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చిరంజీవి పిలుపు మేరకు ఆయన అభిమానులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందు ఉంటూ అనేక మందికి అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మెగా ఫ్యామిలీ అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు

భీమవరంలో జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే
విగ్రహాలు ఏర్పాటు చేయాలి
కలెక్టర్‌కు ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుల వినతి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్లో బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. జగ్జీవన్‌రామ్, అంబేద్కర్, జ్యోతిరావ్ పూలే జయంతి రోజు సెలవులు ఇవ్వడమే కాకుండా, వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో ముద్రించాలన్నారు. ఇలా చేయడం వల్ల విద్యార్థులకు వారి విశిష్టతను తెలియజేసిన వారవుతామని చెప్పారు. భీమవరంలోని ప్రకాశంచౌక్‌లో జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో చీకటిమిల్లి మంగరాజు, పొన్నమండ బాలకృష్ణ, దళిత నేతలు ఉన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

పెన్షనర్ల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నరసాపురం

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ నరసాపురం నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా ఎం.మార్కండేయులు, గౌరవాధ్యక్షులు బి.ఆనంద్‌రాజు, సహాధ్యక్షులుగా ఎంబివి జాకట్, ప్రధాన కార్యదర్శిగా ఆర్ఆర్‌కె రాజు, ట్రెజరరీగా వై.స్వామి నాయుడును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కె.కనకరాజు వ్యవహరించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.మార్కండేయులు, ఆర్ఆర్‌కె.రాజు మాట్లాడుతూ పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలని, రిటైర్ మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని అన్నారు. 12వ పిఆర్‌సి కమిటీ నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రూ.1.76 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణం : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలం గవరపేట గ్రామంలో రూ.1.76 కోట్లతో పంట కాలువపై రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో మహిళలు రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌కు పూలతో, బాణా సంచా వంటి వాటితో స్వాగతం పలికారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి మంత్రి, అంగర పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల కోసం పనిచేసే ప్రజా కూటమి ప్రభుత్వాన్ని భవిష్యత్తులోనూ ఏకగ్రీవంగా బలపర్చాలని కోరారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఎటువంటి మేలు జరగలేదని, నేడు చంద్రబాబు హయాంలో అభివృద్ధి, సంక్షేమం దిశగా మంచి పాలన అందుతోందని తెలిపారు. గవరపేటకు గత టిడిపి ప్రభుత్వ హయాంలో తొలిసారి ఎంఎల్ఎగా గ్రామ అభివృద్ధికి కోట్లాది రూపాయలు నిధులు తీసుకొచ్చానని, ఇంటింటికి వీధి వీధికి సిమెంట్ రహదారుల నిర్మాణం చేపట్టానని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో ఏ ఒక్క పని చేయలేదని తెలిపారు. మళ్లీ కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. చిన్నపాటి ఈ గ్రామంలో రిటైనింగ్ వాల్‌కు రూ.కోటీ 70 లక్షలు ఇచ్చానని, అవసరమైతే మరో రూ.రెండు కోట్లు ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, పాలకొల్లు ఎఎంసి ఛైర్మన్ కోడి విజయభాస్కర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వెదుళ్లపాలెంలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తా

వెదుళ్లపాలెంలో దీర్ఘకాలికంగా వేధిస్తున్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి రామానాయుడు తెలిపారు. పలు డ్రెయినేజీలను స్వయంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రజలను అడిగి అక్కడికక్కడే సంబంధిత అధికారులను పిలిచి సమస్య పరిష్కారం దిశగా అంచనాలు వేయాలని మంత్రి ఆదేశించారు. ఆయన వెంట మల్ల వెంకట మురళి ఎల్లపు లోకేష్, మల్ల వెంకట సత్యనారాయణ, దాడి వీరబాబు, సూరిశెట్టి ఆదినారాయణ, తరుణ్, చాగంటి అన్నవరం ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

లోసరి కాలువను పట్టించుకోరా..!

పేరుకుపోయిన చెత్తాచెదారం, తూడు, గుర్రపుడెక్క
శివారు ప్రాంతాలకు అందని సాగు, తాగు నీరు
పట్టించుకోని అధికారులు

కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రభుత్వం మారింది.. పరిస్థితులు మారతాయి.. సమస్యలు పరిష్కారమవుతాయని ఆశగా ఎదురుచూసిన ప్రజలకు నిరాశే మిగులుతోంది. ఇరిగేషన్ వ్యవస్థలో ఉన్న కాలువలను ప్రక్షాళన చేస్తామని కూటమి ప్రభుత్వం, నాయకులు పదేపదే చెవులు చిల్లులు పడేలా ఊదరగొట్టారు. అదేవిధంగా ప్రభుత్వం కూడా అన్ని శాఖలను సమీక్షించి సమస్యలను పరిష్కరించాలని నిధులు మంజూరు చేసినప్పటికీ ఇరిగేషన్ అధికారులు మాత్రం సమస్యను పరిశీలించడం లేదు. దీంతో భీమవరం ప్రాంతంలో విస్సాకోడేరు కాలువ, కొమరాడ కాలువ, దిసుమర్రు కాలువతో పాటు అనేక కాల్వల్లో చెత్తాచెదారం, గుర్రపుడెక్క తూడు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. కొన్నిసార్లు ఇక్కడ కాలువ ఉందా అని సందేహం కలిగేలా మారాయి. అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. చారించాలని డిమాండ్లు తినిపిస్తున్నాయి

ముఖ్యంగా భీమవరం నుండి లోసరి గూట్లపాడు వెళ్లే కాలువ చూస్తే మరింత దారుణంగా తయారైందని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. కాల్వ పొడవునా ప్లాస్టిక్ వ్యర్థాలు, జంతు కళేబరాలు, థర్మకోల్ షీట్లతో నిండిపోయి పైనుంచి వచ్చిన నీరు కిందకు సాగని పరిస్థితి నెలకొంది. దీనికితోడు గత ప్రభుత్వంలో కాలువల ప్రక్షాళన మర్చిపోవడంతో తూడు, గుర్రపు డెక్క పేరుకుపోయాయి. గొల్లవానితిప్పలోని పంట పొలాలకు, గ్రామస్తులకు తాగునీరుగా ఈ కాలువ నీటినే వినియోగిస్తున్నారు. ఇప్పటికే నాట్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ కాలువలో చెత్తా చెదారం పెరిగిపోవడంతో శివారు ప్రాంతాలకు నీరు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోకతిప్ప, బర్రివానిపేట గ్రామాల పరిధిలో కాలువ మరింత దారుణంగా ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి, సాగు, తాగునీరు అందించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలి
వ్యకాస జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జార్జి, సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి హామీ చట్టంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లను జిల్లా అధికార యంత్రాంగం నియమిస్తోందని, అయితే ప్రస్తుతం దానికి విరుద్ధంగా గ్రామాల్లో కూటమి నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్లను రాజీనామా చేయండని ఒత్తిడి చేసి వారి పార్టీ కార్యకర్తలను నియమించుకునేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. ఇలా వారిని వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. చట్ట ప్రకారం ఫీల్డ్ అసిస్టెంట్లను జిల్లా, మండల స్థాయి అధికారులు నియమిస్తారని, వారిని తొలగించే హక్కు అధికారులకు ఉంది తప్ప రాజకీయ నాయకులకు లేదని తెలిపారు. అలా ఒత్తిడి చేసి రాజీనామా చేయిస్తే చట్టాన్ని ఉల్లంఘించడమేనని తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఎప్పటినుండో పనిచేస్తున్న మేట్లను కూడా తొలగిస్తున్నారని తెలిపారు. మొగల్తూరు మండలంలో ఈ తతంగం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కూటమి నాయకులు పేరుపాలెం మేటును ఇబ్బంది పెట్టడం విరమించుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతం చేస్తామని హెచ్చరించారు.

సంక్షోభంలో ఆక్వా రంగం

పట్టించుకోని కూటమి ప్రభుత్వం
వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఆక్వా రంగం సంక్షోభంలో ఉన్నా రైతుల గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పెదఅమిరంలో వైసిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రానికి అతిపెద్ద మొత్తంలో విదేశీ మారకద్రవ్యాన్ని, ఎగుమతుల వాటాను ఇస్తున్న ఆక్వా పరిశ్రమ తీవ్ర కష్టాల్లో ఉన్నా రైతాంగాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అమెరికా టారిఫ్‌ల పరిణామంతో రేటు తగ్గినా ఇక్కడ వ్యాపారులంతా సిండికేట్ అయ్యి రేటును మరింత తగ్గించేస్తున్నారని తెలిపారు. కొద్ది రోజుల నుంచి పరిణామాలు తీవ్రంగా ఉన్నా, రైతులు ఆత్మహత్యే శరణ్యం అంటున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 2014-19లో కూడా ఇలాగే సిండికేట్ మాయలో చిక్కుకుని ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. వైసిపి హయాంలో ఆక్వాకు కనీస మద్దతు ధర నిర్ణయించడమే కాకుండా, ఆక్వా దాణా ధర కూడా నియంత్రించిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రొయ్యల ధరలు తగ్గడమే గానీ పెరిగిన దాఖలాలే లేవన్నారు. అమెరికా సుంకం సాకుతో రొయ్యలు కొనుగోలు చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకూ తగ్గించేస్తున్నా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో ఆక్వా రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. గతంలో ఇలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనప్పుడు జగన్ ప్రభుత్వం జోక్యం చేసుకొని అండగా నిలిచిందన్నారు.

గురుకుల పాఠశాలకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక పెద తాడేపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. ఒకే స్కూల్ నుండి 450 మంది విద్యార్థులు 18 యూనిట్లుగా ఏర్పడి స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడంతో ఈ గుర్తింపు లభించిందని తెలిపారు. దీనికి సంబంధించిన సమాచారం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ రాష్ట్ర పరిశీలకులు సిరిమువ్వ శ్రీనివాస్ వెల్లడించారని తెలిపారు. దీనిపై డిఇఒ

సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రిన్సిపల్ రాజారావు

ఇవిఎస్.నారాయణ, స్కౌట్స్ అండ్ గైడ్స్ పశ్చిమగోదావరి సెక్రటరీ ఉంగరాల శ్రీనివాస్ స్పందిస్తూ ప్రిన్సిపల్ రాజారావును, శిక్షణ ఇచ్చిన సీనియర్ స్కౌట్స్ ఆఫీసర్ బ్రహ్మేశ్వరరావును అభినందించారు. అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో డిఇఒ నారాయణ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ ఉంగరాల శ్రీనివాస్ చేతుల మీదుగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాజారావు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు ఎంవి.బాలాజీ, ఎస్.ఆనంద్, ఎం.నవీన్, డి.కృష్ణ, బలరాం, రాజేంద్ర, సత్తిబాబు పాల్గొన్నారు.

9న వత్సవాయి భరద్వాజ పునర్నిర్మాణ స్థూపావిష్కరణ

ప్రజాశక్తి - ఆచంట

సిపిఎం జిల్లా నాయకులు అమరజీవి వత్సవాయి భరద్వాజ పునర్నిర్మాణ స్మారక స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల తొమ్మిదో తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు కరుగోరుమిల్లిలో జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, మండల సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ స్థూపావిష్కరణకు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి ఇంటర్ విద్యార్థుల బస్‌పాస్‌ల రెన్యువల్

ప్రజాశక్తి - నరసాపురం

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు ఈ నెల 7వ తేదీ నుంచి బస్ పాసుల పునరుద్ధరణ (రెన్యూవల్) చేయనున్నట్లు ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఆర్‌టిసి డిపోలో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విజయభాస్కర్‌ను అభినందిస్తున్న అంగర రామ్మోహన్

విజయభాస్కర్‌కు అంగర అభినందన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎంసి ఛైర్మన్‌గా నియమితులైన కోడి విజయ భాస్కర్‌ను మాజీ ప్రభుత్వ విప్ అంగర రామ్మోహనరావు అభినందించారు. చిరకాల మిత్రుడు విజయభాస్కర్ టిడిపికి ఎంతో సేవ చేశారని, ఆయన పదవీ కాలంలో రైతులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి అభినందించారు. పాలకొల్లు నియోజకవర్గంలో మంత్రి నిమ్మల రామానాయుడు సహకారంతో రైతులకు మరిన్ని సేవలందిస్తానని విజయభాస్కర్ చెప్పారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక భుజబలరాయుడు తాగునీటి చెరువులో కాలుజారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక ఇల్లాపు వారి వీధికి చెందిన పోతురాజుల శ్రీనివాసు (48) ఆదివారం సాయంత్రం చెరువుగట్టు నుండి అటుగా వెళ్తూ నీరు తాగేందుకు చెరువులో దిగాడు. ప్రమాదవశాత్తూ అతని కాలు జారి చెరువులో పడిపోయాడు. చెరువులో ఉన్న బురదలో కూరుకుపోవడంతో పైకి రాలేకపోయాడు. వెంటనే అక్కడ ఉన్నవారు అతనిని బయటకు తీసిన కొద్దిసేపటికి ప్రాణాలు కోల్పోయాడని స్థానికులు చెప్పారు.

వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో శ్రీరామ నవమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వీరవాసరం సీతారామ స్వామి దేవస్థానంలో మద్దాల చల్లేశ్వరరావు వెంకట నాగలక్ష్మి గోవిందమ్మ దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రికలకు అన్న ప్రసాదాలు అందజేశారు.

పెనుమంట్ర : మండలంలోని నెగ్గిపూడిలో పురాతన రామాలయంలో, మార్టేరు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన శ్రీరామ కళ్యాణానికి యాత్రికులు పోటెత్తారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలు చోట్ల అన్నసమారాధన చేశారు.

భీమవరం టౌన్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పద్మాలయ థియేటర్ సమీపంలోని కోదండరామ ఆలయంలో ప్రముఖ తారకరామా కన్‌స్ట్రక్షన్ అధినేత పళ్ల ఏసుబాబు ఆధ్వర్యంలో శ్రీరాముని కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు వేడుకలకు హాజరయ్యారు. ఎంఎల్ఎ మాట్లాడారు. నియోజవర్గ ప్రజలకు నవమి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆచంట : మండలంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం యాత్రికులకు పప్పు, పానకం పంపిణీ చేశారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, వల్లూరు, భీమలాపురం, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, అయోధ్యలంక గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా రామాలయాల వద్ద అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

ఆకివీడు : ఆకివీడు పాటు గ్రామాల్లో పలుచోట్ల శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. మాదివాడలో నిర్మించిన ఆలయంలో గత నాలుగు రోజుల నుండి పున్ణప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీరామనవమి వేడుకల్లో డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు పాల్గొన్నారు. సిద్ధాపురంలో సీతారామాలయంలో సీతారామ కళ్యాణ మహోత్సవాలు నిర్వహించారు. పట్టణంలోని నవమి పందిళ్లలో తొమ్మిది రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మొగల్తూరు : మండలంలో నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని బట్టల వర్తక సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామాలయం, చిన రామాలయం, సత్రంపాలెం, పేరుపాలెం, కెపి.పాలెం, జాలపల్లి, కాళీపట్నం, కొత్తాఆట తదితర గ్రామాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బట్టల వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



భీమవరం టౌన్: శ్రీరామనవమి వేడుకల్లో ఎంఎల్ఎ అంజిబాబు

కాళ్ల : శ్రీరామ నవమి వేడుకలు మండలంలో వైభవంగా నిర్వహించారు. రామాలయాలకు జనం అత్యధిక సంఖ్యలో పోటెత్తారు. ముఖ్యంగా కాళ్లకూరు గ్రామంలో కోదండరామ ఆలయం వద్ద డాక్టర్ దాట్ల వెంకట రామరాజు ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వెంకట రామరాజు, లక్ష్మీదేవి, ముదునూరి రామబద్రీరాజు, శిరీష దంపతులు కళ్యాణం జరిపించారు. యాత్రికులకు బెల్లం పానకం, మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్ ముక్కలు, అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పట్టణంలోని అన్ని వార్డుల్లో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదం, పానకం పంపిణీ చేశారు. పలు చోట్ల అన్నదానం నిర్వహించారు. పట్టణంలోని పలు రామాలయాల వద్ద మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ దంపతులు నవమి ఉత్సవాల్లో పాల్గొన్నారు. గజలక్ష్మి థియేటర్ వద్ద మారెళ్ల మాణిక్యాలరావు దంపతులను దీవించారు.

నరసాపురం : మండలంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణం తిలకించేందుకు యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అన్ని ఆలయాల వద్దా స్వామి వారి కళ్యాణం చూసేందుకు వీలుగా చలువ పందిర్లు వేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. కళ్యాణం అనంతరం అన్న సమారాధనలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పలు ఆలయాలను సందర్శించి ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు చెప్పారు. నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రామాలయం వద్ద ఆదివారం శ్రీరామనవమి వేడుకలను పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గా ప్రసాద్ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి వారికి డిఎస్‌పి జి.శ్రీవేద, ట్రెయినీ డిఎస్‌పి కె.మానస,
సిఐ బి.యాదగిరి, ఎస్ఐలు పూజలు నిర్వహించారు.

ఉండి : వెలివర్రు గ్రామంలోని రామాలయంలో గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు దంపతులు స్వామి వారికి కళ్యాణం చేశారు. ఉప సభాపతి రఘు రామకృష్ణంరాజు సతీమణి రమాదేవి, కుమారుడు భరత్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వర రాజు, బిజెపి ఉండి నియోజకవర్గ కో కన్వీనర్ గాదిరాజు వెంకటేశ్వరరాజు, వీర పేరంటాలమ్మ దేవస్థానం కమిటీ ఛైర్మన్ గాదిరాజు వెంకటరాజు తదితరులు దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. వెలివర్రు గ్రామంలోని వినాయక ఆలయం వద్ద వీర పేరంటాలమ్మ ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ మంతెన రంగరాజు త్రివేణి దంపతులు ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణాన్ని కనుల పండుగగా నిర్వహించారు.

తాడేపల్లిగూడెం: కస్పా పెంటపాడు గ్రామంలోని బైరాగి మఠంలో వేణుగోపాల స్వామి ఆలయం వద్ద జరిగిన సీతారామచంద్రమూర్తి స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, పెంటపాడు మండల అధ్యక్షులు పుల్లా బాబి, కాజులూరి మల్లేశ్వరరావు, చేపల రమేష్ పాల్గొన్నారు.



నరసాపురం :శ్రీరామనవమి వేడుకల్లో పోలీసులు

వృద్ధులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించే ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యులు హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలుమహేంద్ర తణుకు, పైడిపర్రు, సజ్జాపురం, పాతవూరు ప్రాంతాల్లో పర్యటించి ఆరుగురు వృద్ధులకు ఉచిత వైద్య సేవలందజేశారు. సూరపనేని సత్యనారాయణ ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డులు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తేన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

CHANGE IN NAME

I, **DURGA DEVI BOKKA** Resi. 8-126, Subbaraydu Gudi Veedhi, Mandapaka, Tanuku mandalam, District West Godavari e Andhra Pradesh 534218. Previously I was Known and called as **DURGA DEVI SRINIVAS BOKHA** now I will be known As **DURGA DEVI BOKKA**